క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న యువనేత జయిమనోజ్ రెడ్డి

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఎరుకల వెంకటేష్ నోటి ఇన్‌ఫెక్షన్, ముక్కు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన బంధువులు విషయాన్ని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు వై.జయమనోజ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించగా రూ.1.30 లక్షలు మంజూరైంది. ఈ మేరకు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో లబ్ధిదారుడికి చెక్కును అందజేశారు. యువనేత మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాలో పూజలు



దర్గా వద్ద భక్తుల సందడి

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగస్వామి దర్గాలో అమావాస్య పూజలను నిర్వహించారు. ఆదివారం అమావాస్య కావడంతో పలువురు భక్తులు పిండి వంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు స్వామి దర్శనానికి భారీగా తరలిరావడంతో దర్గా పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. అంతకు ముందు తెల్లవారుజామున 5 గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీ స్వామి సమాధికి గంధంతో పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు.

బసవేశ్వరస్వామికి విశేష పూజలు



భక్తులకు అన్నదానం



ప్రత్యేక అలంకరణలో బసవేశ్వరస్వామి

కోసిగి: మండల కేంద్రంలోని బసవన్న కొండపై వెలసిన శ్రీబసవేశ్వరస్వామికి ఆదివారం అమవాస్య పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఉమేష్ ఆధ్వర్యంలో స్వామివారికి వేకువజామున నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు, మహా మంగళహారతులు తదితర పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

నేడు పాఠశాల భవనాల ప్రారంభం



కౌతాళంలోని కన్నడ పాఠశాల

కౌతాళం: మండల కేంద్రంలోని కన్నడ ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు కింద రూ. 22 లక్షలతో మరమ్మతు పనులతో పాటు పలు అభివృద్ధి పనులు చేశారు. వీటిని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సోమవారం ప్రారంభిస్తున్నట్లు ఎంఈఓ శోభరాణి తెలిపారు. పాఠశాలలో 8 గదులకు మరమ్మతులు, బాలబాలికలకు ప్రత్యేంగా మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, వంటగది నిర్మాణం చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతరవణంలో చదువులు చెప్పాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పాఠశాలల రూపరేఖలను మార్చివేసిందన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామ సమీపంలో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. మొత్తం 10 జతల వృషభాలు పాల్గొన్నాయి. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు, చంద్రశేఖర్ ప్రారంభించారు. హోరాహోరీగా జరిగిన బండలాగుడు పోటీల్లో విజేతగా కోడుమూరు మండలం వెంకటగిరి వృషభాలు గెలుపొందాయి. వాటి యజమాని రైతు బీఎల్‌కేకు రూ.50 వేలు నగదును ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు అందజేశారు. తర్వాతి స్థానాల్లో నిలిచిన పామిడికి చెందిన కర్లం కృష్ణ, పులికొండకు చెందిన మాధవరాజుకు రూ.40 వేలు, పులికొండకు చెందిన రంగస్వామికి రూ.30 వేలు, యనకండ్ల వేణుగోపాల్‌నాయుడుకు రూ.20 వేలు, బళ్లారికి చెందిన రమేష్ బాబు, పుచ్చకాయలమాడకు చెందిన ధనుంజయకు రూ.10 వేలను ఆలయ నిర్వాహకులు అందజేశారు. పోటీలను చూసేందుకు పెద్దసంఖ్యలో రైతులు తరలివచ్చారు.

గ్రామ స్వరాజ్యం కల సాకారం

- సచివాలయ వ్యవస్థతో ప్రజలకు చేరువైన సేవలు
- మండలంలో ఇప్పటికే 18 సచివాలయాలు పూర్తి
- మరో 8 రూఫ్ లెవల్, 9 బేస్‌మట్టం స్థాయిలో నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఆదోని రూరల్: జాతిపిత మహాత్మా గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారు. గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఉన్న చోటనే ప్రభుత్వ సేవలు అందేలా కృషి చేస్తున్నారు. ప్రతి సచివాలయానికి 13 మంది వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగులను నియమించి అన్ని రకాల సేవలందిస్తున్నారు. అలాగే దేశంలో ఎక్కడా జరగని రీతిలో రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులకు సచివాలయాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది.

సెక్రటేరియట్‌ను తలపిస్తున్న గ్రామ సచివాలయాల నిర్మాణాలు



బసరకోడులో నిర్మాణం పూర్తయిన సచివాలయ భవనం

రాష్ట్ర రాజధానిలోని సెక్రటేరియట్‌ను తలపించేలా గ్రామాల్లో రూ.40 లక్షలు వెచ్చించి అన్ని హంగులతో సచివాలయ భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఆదోని మండలంలో మొత్తం 44 గ్రామాలు ఉండగా, 41 పంచాయతీలకుగానూ 35 సచివాలయాలు ఉన్నాయి. ఈ 35 సచివాలయాల నిర్మాణ పనులను ప్రభుత్వం అన్ని హంగులతో నిర్మిస్తోంది. వాటిలో ఇప్పటికే 18 సచివాలయ భవనాల నిర్మాణాలు పూర్తి కాగా, రూఫ్ లెవెల్‌లో–8, బేస్‌మట్టం లెవెల్‌లో–9 నిర్మాణంలో ఉన్నాయి. వీటి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులను విడుదల చేస్తోంది.



మదిరెలో రూఫ్ లెవల్‌లో సచివాలయ భవన నిర్మాణం

సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు

గతంలో ప్రజలు, విద్యార్థులు, రైతులు ఏ చిన్న పనికైనా మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. నేడు ఆ పనులన్నీ స్థానికంగా గ్రామ సచివాలయాల్లోనే అందుతున్నాయి. వీటి వల్ల ప్రజలకు సమయం, ఖర్చు ఆదా అవుతుంది. పని జరుగుతుందన్న నమ్మకం ఏర్పడింది. ప్రజలకు, విద్యార్థులకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు, అమ్మ ఒడి, నవరత్నాలు, హౌసింగ్ ఇళ్ల మంజూరు, పింఛన్ దరఖాస్తులు, ఆధార్ నమోదు, ఇంటి గుత్త, భూ సర్వే, ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు దరఖాస్తు, పంటల నమోదు, పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సంక్షేమంపై ఆరా, గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో మహిళా పోలీసు, ప్రజలు ఆరోగ్యానికి సంబంధించి వైద్యసేవలు అందించేందుకు అందుబాటులో ఏఎన్‌ఎంను నియమించారు. సచివాలయాల ద్వారా అన్ని సేవలు గ్రామ స్థాయిలోనే అందుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకోగానే పింఛన్ వచ్చింది



నా భర్త ఈశ్వరప్పకు 79 ఏళ్లు. గత పదేళ్లుగా పింఛన్ కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరిగాం. గత ప్రభుత్వంలో ఏ అధికారి పట్టించుకోలేదు. మా గ్రామంలో సచివాలయం ఏర్పాటయిన తర్వాత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. వెంటనే నా భర్తకు పింఛన్ మంజూరు చేశారు. చాలా సంతోషంగా ఉన్నాం. – **డి.జయమ్మ, పెద్దతుంబళం గ్రామం**

సచివాలయంలోనే పనులు పూర్తవుతున్నాయి



గతంలో చిన్న పనికి కూడా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. నేడు గ్రామంలోనే సచివాలయం ఏర్పాటు కావడంతో అన్ని పనులు స్థానికంగానే పూర్తవుతున్నాయి. భూ సమస్యలు, హౌసింగ్, పింఛన్ తదితర సమస్యలపై సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయగానే అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు.

– **అయ్యన్న, నాగనాథనహళ్లి గ్రామస్తుడు**

జగనన్న చొరవతోనే లబ్ధి పొందుతున్నాం



సీఎం జగనన్న మహోన్నత లక్ష్యంతో గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సేవల కోసం మేమంతా ఆదోనికి వెళ్లాల్సిన పనిలేదు. స్థానికంగానే మా సమస్యలను అర్జీల రూపంలో సచివాలయంలోని అధికారులకు విన్నవించుకుంటున్నాం. వారం రోజుల్లోపు సమస్యలను పరిష్కరిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. – **గంగాధర్, ధణాపురం గ్రామస్తుడు**

వేగంగా భవనాల నిర్మాణం



మండలంలో 35 సచివాలయాలకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు చొప్పున ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఇప్పటివరకు 18 సచివాలయాల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. త్వరలోనే వీటిని కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. – **మాలిక్‌బాషా, పీఆర్ ఏఈ**

బెంగళూరుకు వెళ్లి ఈ-కేవైసీ



ఈ- కేవైసీ చేయిస్తున్న వలంటీర్ వీరేష్

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామానికి చెందిన కొందరు కూలీలు పనుల కోసం బెంగళూరుకు వెళ్లారు. పేదలందరికీ ఇళ్ల పథకంలో స్థలాలు పొందిన లబ్ధిదారులు వాటిని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వలంటీర్ లాగిన్‌లో ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. వారు గ్రామానికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో వలంటీర్ వీరేష్ నేరుగా బెంగళూరుకు వెళ్లాడు. గ్రామానికి చెందిన సదాపురం పద్మ, నాగేంద్రమ్మ, దొడ్డి నరసమ్మ, హరిజన నాగలక్ష్మీ, బళ్లారి బుడ్డమ్మలతో ఈకేవైసీ చేయించాడు. వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పులిగట్టు ఆంజనేయస్వామి పల్లకోత్సవం



పల్లకీపై విహరిస్తున్న స్వామివారు

కౌతాళం: మండల పరిధిలోని ఏరిగేరి గ్రామ కొండల్లో వెలసిన శ్రీపులిగట్టు ఆంజనేయస్వామి పల్లకోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు ప్రారంభమై సోమవారం ఉదయం 10 గంటల వరకు సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు ప్రదీప్‌రెడ్డి స్వామివారికి పూజలు చేశారు. సర్పంచ్ గోవిందు, నీలకంఠ రెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణకు చర్యలు

ఆదోనిటౌన్: ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ నివారణకు కట్టుబడి ఉండాలని, బట్ట సంచులనే వాడాలని అవోపా అధ్యక్ష కార్యదర్శులు వంకదారి శ్రీనాథ్‌గుప్తా, శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) మరియు అవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ప్లాస్టిక్ రహిత సమాజం' నినాదంతో ఉచితంగా బట్ట సంచులను పంపిణీ చేశారు. ఆదోని పెద్ద మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం దాదాపు 2 వేల సంచులను పంపిణీ చేశారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించాలని కోరారు. కార్యక్రమం నిర్వహనకు ఆదోని గ్రీనరీ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రెసిడెంట్, అడ్వకేట్ లలిత, సభ్యులు కోమల చేయూతనందించారు. అవోపా సభ్యులు కాకుబాళ్ నగేష్, వంకదారి మమతాశ్రీ, ఈరన్న శెట్టి, డైమండ్ రఘు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బట్ట సంచులను పంపిణీ చేస్తున్న అవోపా సభ్యులు

సావిత్రిబాయి పూలేకు నివాళి



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదోనిటౌన్: స్థానిక బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు మాట్లాడుతూ.. సావిత్రిభాయిపూలే భారతదేశపు మొట్టమొదటి ఆధునిక స్త్రీవాదుల్లో ఒకరుగా కీర్తించబడ్డారన్నారు. ఆమె మహిళల హక్కుల కోసమే మాత్రమే కాకుండా కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. సంఘసంస్కర్త, ఉపాధ్యాయినీ, రచయిత్రిగా నిమ్నవర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. డివిజన్ గౌరవ సలహాదారులు ధణాపురం శేషన్న, తాలూకా ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్షావలి, బి.రాముడు, కపటి వీరభద్ర, వి.రామాంజనేయులు, మల్లేశ్వరప్ప, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆదోనిఅర్బన్: స్వకుల సాలే సామాజికవర్గానికి చెందిన మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వరల్డ్ సాలే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విజయవక్తే (ముంబై) పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని అంబాభవానీ పేటలోని మినీ కళ్యాణ మండపంలో స్వకులసాలే అంకినీ దశాంకినీ మహిళా మండలి వారి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. స్వకుల సాలే అంకిని దశాంకిని మహిళా మండలి సభ్యులు సాకరే సుధ, ఫరంగి నాగజ్యోతి, రాసాలే పద్మావతి, సరోజ, స్థానిక వార్డు కౌన్సిలర్ మహేశ్వరి, అంబాభవానీ దేవాలయ కమిటీ చైర్మన్ గోపి, సభ్యులు అంబలిదాగే లక్ష్మిబాయి, సఫారే జ్ఞానేశ్వరి పాల్గొన్నారు. మహిళలందరూ కో–ఆపరేటివ్ సొసైటీ స్థాపించేందుకు ఏకగ్రీవంగా సమ్మతి తెలిపారు. సొసైటీ విధి విధానాలను రూపొందించుకుని మహిళలకు వివరించాలని సభ్యులకు సూచించారు. విజయ వక్తే మాట్లాడుతూ మహిళా కో ఆపరేటివ్ సొసైటీకి తన సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. తనవంతు సహకారంగా రూ.11 వేలు అందజేస్తున్నట్లు చెప్పారు. అంబాభవానీ దేవస్థాన ధర్మకర్త సాకరే గోపీ మాట్లాడుతూ తన పాలకమండలి తరఫున కో ఆపరేటివ్ సొసైటీ అభివృద్ధికి సహాయ సహకారం అందింస్తానన్నారు.



స్వకుల సాలే మహిళా సభ్యులతో విజయవక్తే

ఈరన్నస్వామి ఆలయంలో అమావాస్య పూజలు



ఈరన్నస్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కౌతాళం: స్థానిక ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం నుంచే భక్తుల తాకిడి ఉండడంతో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప నుంచి ప్రత్యేక బస్సులను నడిపారు. కౌతాళం పోలీసులు బందబస్తు ఏర్పాటు చేశారు. అలాగే ఉరుకుందకు ఐదు కిలోమీటర్ల దూరంలోని బుదుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయం, మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది.

ఎండ వేడిమితో జాగ్రత్త

హొలహర్వి: వేసవితాపం ఎక్కువైన కొద్దీ ఆరోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి తిమ్మన్న అన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఎండవేడితో వడదెబ్బ, కండరాల నొప్పి, అలసట వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయన్నారు. వడదెబ్బ విషయంలో వీలైనంత త్వరగా వైద్య సాయం తీసుకోకపోతే ప్రాణాపాయం ఏర్పడుతుందన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలన్నారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ఆదోని సెంట్రల్: మండల పరిధిలోని అరెకల్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. 5వ తరగతిలో ప్రవేశం పొందేందుకు 1398 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1258 మంది పరీక్షకు హాజరైనట్లు గురుకుల పాఠశాల సుపరింటెండెంట్ టీఏజీ సునీత తెలిపారు. 140 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే ఇంటర్మీడియెట్ ప్రవేశాలకుగాను 568 మంది దరఖాస్తు చేసుకోగా 475 మంది పరీక్షలు రాశారని తెలిపారు. 93 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. సూపర్ వైజర్ జె.సువర్ణ , మండల విద్యాధికారి రాజేంద్రప్రసాద్ పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం బాటిళ్లతో ఎస్‌ఐ

మంత్రాలయం: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను మాధవరం చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం సాయంత్రం మాధవరం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేశామన్నారు. ఆదోనికి చెందిన బందే అలీ బొలెరో వాహనంలో 25 బాక్స్‌లలో 2400 ఒరిజనల్ టెట్రా ప్యాకెట్లు తీసుకొస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనం సీజ్ చేసి వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

చిన్నారికి తప్పిన ప్రమాదం

- జెయింట్‌వీల్ క్యాబిన్ నుంచి పట్టుతప్పి వేలాడిన చిన్నారి

వెల్దుర్తి(కృష్ణగిరి): మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా వెల్దుర్తి పట్టణ సమీపంలోని బ్రహ్మగుండంలో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్ క్యాబిన్ నుంచి పట్టుతప్పిన చిన్నారి భువి (4వ తరగతి) చేతికందిన రాడ్డును పట్టుకుని వేలాడుతూ చివరకు ఇతరులు పైకి లాక్కోవడంతో ప్రమాదం నుంచి బయటపడింది. వివరాలు.. కర్నూలులో నివాసం ఉంటున్న మాధవి (వెల్దుర్తికి చెందిన మహిళ), శ్రీకాంత్ బంధువర్గంతో కలిసి ఆదివారం బ్రహ్మగుండంలో రథోత్సవానికి హాజరయ్యారు. తర్వాత తల్లి, తండ్రి, చిన్నారి, బంధువర్గంలోని యువకులు జెయింట్ వీల్‌లోని మూడు క్యాబిన్‌లలో ఎక్కి కూర్చున్నారు. వీల్ తిరగడం ప్రారంభమయ్యాక క్యాబిన్‌లోని చిన్నారి భువి పట్టుతప్పి పడిపోతూ చేతికందిన రాడ్డు పట్టుకుని వేలాడింది. అక్కడున్న ప్రజల హాహాకారాలతో అప్రమత్తమైన నిర్వాహకులు వీల్ రన్నింగ్‌ను ఆపారు. ఆ సమయంలో చిన్నారి 30 అడుగుల ఎత్తులో వేలాడుతోంది. అదే క్యాబిన్‌లో ఉన్న వారు చిన్నారిని పైనుంచి పట్టుకోగా కింది క్యాబిన్‌లో ఉన్నవారు పట్టుకుని సపోర్టు ఇచ్చారు. నిర్వాహకులు జెయింట్ వీల్‌ను ఎక్కే ప్రయత్నంలో ఉండగా క్యాబిన్‌లోని వారు చిన్నారిని పైకి లాక్కున్నారు. తర్వాత సురక్షితంగా కిందకు దిగారు. ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గ్రామాల్లో పోలీస్ కవాతు

దేవనకొండ: జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు రాబోయే జనరల్ ఎలక్షన్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ శ్రీనివాసులు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం దేవనకొండ, కుంకనూరు, వెలమకూరు, పి.కోటకొండ, కప్పట్రాళ్ల గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. సెంట్రల్ ఫోర్స్ బలగాలతో కవాతు నిర్వహించినట్లు సీఐ చెప్పారు. ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఆదోనిటౌన్: పట్టణంలోని 27వ వార్డు మసీదపుర వీధిలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు చైర్‌పర్సన్ బోయ శాంత, యువనేత మనోజ్ కుమార్‌రెడ్డి భూమిపూజ చేశారు. చైర్‌పర్సన్ గడ్డపారతో పునాదులు తవ్వుతూ పనులను ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం పథకం కింద మంజూరైన రూ.16 లక్షలతో సీసీ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని వారు తెలిపారు. ప్రతి వార్డులో రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల మేర అభివద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. వార్డు ఇన్‌చార్జ్ సింహం నాగేంద్ర, వైస్ చైర్మన్ గౌస్, కార్యకర్తలు, నాయకులు మమ్మత్తు స్వామి, షఫీ తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత

కౌతాళంలో రేపటి నుంచి దేవర

- తొమ్మిదేళ్ల తర్వాత నిర్వహణ



మారెమ్మవ్వ



ముస్తాబైన ఆలయం

కౌతాళం: కౌతాళంలో దేవరను నిర్వహించడానికి ఏర్పాట్లను పూర్తి చేశారు. 9 ఏళ్ల తర్వాత ఉత్సవాలు జరుగుతుండడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. దేవర నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మారెమ్మ ఆలయం, సుంకలమ్మ ఆలయం, రామక్కమ్మవ్వ ఆలయాలను ముస్తాబు చేశారు. ఈనెల 12,13 తేదీల్లో (మంగళ, బుధవారాల్లో) ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు తమ ఇళ్లను రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. ప్రతి కుటుంబం పొట్టేళ్లను కొనుగోలు చేసింది. గ్రామ దేవత పండుగ కావడంతో ప్రతి ఇంటి నుంచి రూ.30 వేల నుంచి లక్ష వరకు ఖర్చు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మంగళవారం రాత్రి 12గంటల తర్వాత రాచమ్మగారి రాగమ్మ ఇంటి నుంచి మేటి కుంభం బయలు దేరి అమ్మవారికి చేరి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు రాగమ్మ ఇంటి నుంచి కుంభాలు బయలుదేరి మారెమ్మవ్వ, సుంకలమ్మవ్వ, రామక్కమ్మవ్వల దేవాలయాలకు చేరి పూజల అనంతరం దేవర ప్రారంభం అవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలను గ్రామస్తులంతా కలిసికట్టుగా నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు రాఘవేంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రహాల్లదచారి, సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు.

వైభవం.. సిద్ధరూఢస్వామి రథోత్సవం





సర్కార్ కుంభాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో సిద్ధరూఢస్వామి

పెద్దకడబూరు: మండల కేంద్రంలో శ్రీసిద్ధరూఢ స్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి కుంకుమార్చన, తులసీ అర్చన, బిల్వార్చన, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు, దూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. గ్రామస్తులు పిండివంటకాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయం నుంచి సిద్ధరూఢస్వామి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల మీదుగా మేళతాళలతో రథంపై కొలువుదీర్చారు. గ్రామ పెద్దలు రెడ్డి రామలింగారెడ్డి ఇంటి నుంచి సర్కార్ కుంభాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి శివనామ స్మరణతో భక్తజనుల కరతర ధ్వనుల మధ్య ముందుకు కదిలించారు. పెద్దబావి వద్దనున్న బసవన్న కట్ట దగ్గరకు లాగి తిరిగి యథాస్థానానికి తీసుకొచ్చారు. చుట్టుపక్కల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత వై.ప్రదీప్‌రెడ్డి, ఖాదీ, విలేజ్ డెవలప్‌మెంట్ చైర్‌పర్సన్ భాగ్యమ్మ, ఎంపీపీ శ్రీవిద్య, సింగిల్‌విండో అధ్యక్షుడు హనుమంతరెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, రాంమ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విజయేంద్రరెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, మాజీ ఎంపీపీ రఘురాముడు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు